పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించినట్లు గణపవరం ఎఒ వైవిఎస్.ప్రసాద్ తెలిపారు. సెక్టోరియల్ అధికారి నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, సెక్టోరియల్ పోలీస్ అధికారి బి.శ్రీనివాసులతో కలిసి స్థానిక డిగ్రీ కాలేజీ, పంచాయతీ, చిన్న రామచంద్రపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జనార్దనపురం ఎంపిపి పాఠశాలలో ఎనిమిది బూత్‌లను పరిశీలించినట్లు చెప్పారు. ఈ ఎనిమిది బూత్‌ల్లో ఎన్నికల నిర్వహణకు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బూత్ లెవెల్ అధికారులు సహకరించారని చెప్పారు.

పోలింగ్ బూత్‌లు పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

వాట్సాప్ పరీక్షలు..!

విద్యాశాఖలో గాడితప్పిన పరీక్షల నిర్వహణ
ఫార్మెటివ్ పరీక్షల నిర్వహణ తీరు దారుణం
ఉపాధ్యాయులకు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రాలు
ప్రశ్నలు బోర్డుపై రాస్తే విద్యార్థులు పరీక్ష రాసే పద్ధతిపై విమర్శల వెల్లువ
ప్రింటెడ్ ప్రశ్నాపత్రం లేక మూడు లక్షల మంది విద్యార్థుల అవస్థలు
45 నిమిషాల సమయం సరిపోక ఆపసోపాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నూతన విద్యావిధానం ముసుగులో ఇప్పటికే విద్యావ్యవస్థ గాడితప్పింది. ప్రభుత్వం ఫార్మెటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరు మరింత దారుణంగా తయారైంది. విద్యార్థులకు పరీక్ష పేపర్ ఇచ్చే పరిస్థితి కూడా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయుల వాట్సాప్‌కు పంపించి పరీక్షలు నిర్వహించే దుస్థితికి విద్యాశాఖ చేరింది. ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు ఏడాదిలో నాలుగుసార్లు ఫార్మెటివ్ పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో వీటిని యూనిట్ టెస్ట్ పరీక్షలుగా పిలిచేవారు. ఈ పరీక్షలు 20 మార్కులకు నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం నాలుగో ఫార్మెటివ్ పరీక్ష జరుగుతోంది. ఈ నెల 23న పరీక్షలు ప్రారంభమవ్వగా 27న జరిగే ఇంగ్లీష్, టోఫెల్ పరీక్షలతో ముగియనున్నాయి. ఈ పరీక్షలు రాసేందుకు గడిచిన కొద్దిరోజులుగా విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. పరీక్షల నిర్వహణ అంటే ప్రశ్నాపత్రం విద్యార్థులకు ఇవ్వడం, వారు అందులోని ప్రశ్నాలకు జవాబులు రాయడం అనేది ఉంటుంది. ఈ పరిస్థితికి విద్యాశాఖ పూర్తిగా తిలోదకాలిచ్చేసింది. రెండు, నాలుగు ఫార్మెటివ్ పరీక్షలకు ప్రశ్నాపత్రం లేకుండా చేసింది. రెండు, నాలుగు ఫార్మెటివ్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయులకు వాట్సాప్‌లో పంపుతున్నారు. ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను బోర్డుపై రాస్తే వాటిని విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు దాదాపు మూడు లక్షల మంది వరకూ ఉన్నారు. వీరంతా ఫార్మెటివ్-4 పరీక్షలు రాసేందుకు నానాతిప్పలు పడుతున్నారు. ఫార్మెటివ్ పరీక్ష 20 మార్కులకు 45 నిమిషాలు సమయం మాత్రమే ఉంటుంది. ఎనిమిది మార్కులకు బిట్లు, 12 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే వీటిని పేపర్‌పై ఎక్కించుకుని తర్వాత పరీక్ష రాయాలి. దీంతో 45 నిమిషాల సమయం సరిపోని పరిస్థితి కన్పిస్తోంది. అంతేకాకుండా ప్రశ్నలు రాసుకునేటప్పుడు విద్యార్థులంతా పక్కపక్కనే ఉండటంతో కాపీయింగ్ జరిగే పరిస్థితి ఉంటోంది. దీంతో విద్యార్థుల ప్రతిభాపాటవాలకు కొలమానంగా నిలవాల్సిన పరీక్షలు తూతూమంత్రంగా అన్నట్లు తయారయ్యాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్న చోట్ల అన్ని తరగతులకూ సంబంధించిన ప్రశ్నాపత్రాలను బోర్డుపై రాసి పరీక్షలు రాయించడం ఉపాధ్యాయులకు కత్తిమీద సాములా మారింది. పోటీ ప్రపంచంలో విద్యావ్యవస్థను మరింత మెరుగుపర్చాల్సిన పరిస్థితులు ఉన్నప్పటికీ అసలుకే ఎసరు పెడుతున్న దుస్థితి ఏర్పడింది. నూతన విద్యావిధానం పేరుతో మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్న తీరు అందరినీ తీవ్రంగా కలిచివేస్తోంది. పరీక్ష పేపర్లు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థుల ప్రతిభను బయటకు తీసేవిధంగా పరీక్షలు నిర్వహించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఈ విధంగా విద్యావిధానం కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తారో పాలకులు చెప్పాల్సి ఉంది. ఇక నుంచైనా ఫార్మెటివ్ పరీక్షలకు ప్రశ్నాపత్రాలు అందించి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

డబ్ల్యుటిఒను బాయ్‌కట్ చేయాలి

రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ హరేరామ్

ప్రజాశక్తి - భీమవరం

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. తిరిగి రైతులపై దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని, రాబోయే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ విమర్శించారు. మన దేశ రైతాంగానికి వ్యతిరేకంగా ఉన్న డబ్ల్యుటిఒను బాయ్‌కట్ చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం డబ్ల్యుటిఒతో ఒప్పందం, మద్దతు ధర, ప్రభుత్వ హామీల అమలు కోసం పోరాడుతున్న రైతాంగంపై ప్రయోగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాల అమలులో ముందుందని విమర్శించారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని కోరారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపి యువరైతు మరణానికి కారణమైన హర్యానా పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత కిసాన్ సభ నాయకులు లంక కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి నాయకులు కోనాల భీమారావు, చెల్లబోయిన రంగారావు, రైతు నాయకులు ఆనందబాబు, దండు శ్రీనివాసరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

'స్పందన'లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 237 వినతులను అధికారులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మాట్లాడారు. ప్రజల నుండి అందే విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత కూడా పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీఓపెన్ అవుతున్నాయన్నారు. స్పందన దరఖాస్తులు రీఓపెన్ కాని రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు అర్జీదారులకు నాణ్యమైన పరిష్కార ఎండార్స్‌మెంటు అందజేయాలన్నారు. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందించినట్లన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివనారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ కానాల సంగీత్‌మాధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో స్వీప్ నోడల్ అధికారి జిసిహెచ్.ప్రభాకరరావు స్వీప్ అవగాహనా కార్యక్రమాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని, దీనికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 82 శాతం ఓటింగ్ నమోదైందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 95 శాతం పైబడి నమోదుకు అన్ని విధాలా ప్రచార కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్, వికలాంగులైన ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రలోభాలకు దూరంగా ఉండాలన్నారు.


సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన పబ్లిక్ పరీక్షల నిర్వహణా ఏర్పాట్లపై సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. మార్చి 18 నుండి 30వ తేదీ మధ్య నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 21,341 మంది, గత పరీక్షల్లో తప్పిన వారు 6,085 మంది మొత్తం 27,426 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలు మార్చి 18 నుండి మార్చి 27 వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సికి 997 మంది, ఇంటర్ పరీక్షలకు 1,890 మంది మొత్తం 2,887 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ నెల 27 నుండి టెట్ పరీక్షల అనంతరం ఇంటర్, ఎస్ఎస్‌సి పరీక్షలు నిర్వహించనున్నందున అన్ని రకాల పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివనారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డిఇఒ ఆర్.వెంకట రమణ, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించాలి

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో జెసి రామ్‌సుందర్‌రెడ్డి

వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మూడు రకాల వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధిని నిరుపేదల బ్యాంకు ఖాతాలో జమ చేయడంలో బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు, చిన్న వ్యాపారులకు, రైతులకు రుణాలు అందించేందుకు బ్యాంకు అధికారులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిఆపరు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, జిల్లా వార్డు గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన గూటికి కొత్తపల్లి


పవన్‌కళ్యాణ్‌తో కొత్తపల్లి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేన పార్టీలో చేరారు. సోమవారం హైదరాబాదులో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన గెలుపునకు కృషి చేయాలన్నారు. సుబ్బారాయుడు చేరికతో పశ్చిమగోదావరి జిల్లాలో పార్టీలో కొత్త ఉత్సాహం వస్తుందని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో సుబ్బారాయుడు అనుభవం జనసేన విజయానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్తపల్లి విద్యుత్‌శాఖ మంత్రిగా పని చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షుడిగా పని చేశారు. 2009లో ప్రజారాజ్యంలో చేరారు. అనంతరం వైసిపిలో చేరారు. ఇటీవల జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించి సోమవారం ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీ గూటికి చేరారు.

అసంతృప్తి.. ఆవేదన

టిడిపి, జనసేన నియోజకవర్గ ఆత్మీయ సమావేశం తీరిది

అధినేతలు చంద్రబాబు, పవన్ నిర్ణయాలపై ఇరు పార్టీ నేతల్లో అసంతృప్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గ టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశంలో ఇరు పార్టీల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరు పార్టీల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే చివరకు చేసేదేమీ లేక ఎంఎల్ఎ మంతెన రామరాజు విజయానికి అంతా కలిసికట్టుగా కృషి చేయాలని నినదించారు. పెద్ద మేరం నిర్మలా ఫంక్షన్ హాలులో ఉండి నియోజకవర్గ టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జనసేన ఎక్కువ సీట్లు పోటీ చేసే విధంగా అధిష్టానం ఆలోచన చేయాలని, ఈ విషయాన్ని చంద్రబాబు, పవన్‌ల దృష్టికి తీసుకెళ్లాలని జనసేన కాళ్ల మండలాధ్యక్షులు రామాంజనేయులు కోరారు. ఉండి స్థానం జనసేనకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఉమ్మడిలో అది టిడిపికి వెళ్లిందని, లేకపోతే జనసేన ఉండి ఇన్‌ఛార్జి, బిసి ముఖ్య నేత జుత్తిగ నాగరాజు పోటీ చేసేవారని జనసేన పాలకోడేరు మండలాధ్యక్షులు గాదం నానాజీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న ఎంఎల్ఎ రామరాజు గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి నాయకులకు ఎటువంటి గుర్తింపు ఉంటుందో జనసేనకు కూడా అదే గుర్తింపు ఉంటుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సీట్ల కేటాయింపుల్లో ఎక్కువ తక్కువ అనే భావం చూడకుండా ఉమ్మడిగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎంఎల్ఎ శివరామరాజు గ్రూపు దూరం

టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశానికి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు గ్రూపు దూరంగా ఉంది. అధిష్టానం తీసుకున్న నిర్ణయం పట్ల శివరామరాజు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆత్మీయ సమావేశానికి ఆయనతో పాటు ఆయన గ్రూపు నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కాలేదు. ఇదిలా ఉంటే ఆత్మీయ సమావేశానికి తమకు ఆహ్వానం రాలేదంటూ శివరామరాజు అసంతృప్తి గ్రూపువారు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి కలయికతో ఉండిలో విజయం సాధిస్తాం

శివరామరాజు విషయంలో అధిష్టానం జోక్యం చేసుకోవాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

కాళ్ల : తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి కలయికతో ఉండిలో ముందుకు సాగుతూ రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు కోరారు. మండలంలోని పెదఅమిరంలో టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉండి ఎంఎల్ఎ రామరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రెండేళ్ల క్రితమే సిట్టింగ్ ఎంఎల్ఎ టిక్కెట్‌ను ఖరారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉండిలో ఎటువంటి బేదాభిప్రాయాలు లేకుండా అధిష్టానం జోక్యం చేసుకోవాలని కోరారు. చంద్రబాబు దృష్టిలో శివరామరాజుకు ప్రాధాన్యత ఉందన్నారు. పార్టీ పరిశీలకులు కొత్త నాగేంద్రబాబు మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఎ శివరామరాజు తప్పకుండా టిడిపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాలరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, గవరలక్ష్మి, టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, జివి.నాగేశ్వరరావు, దెందుకూరి కోటిరాజు, జనసేన మండలాధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, మాజీ ఎంపిపి అరేటి వెంకటరత్నప్రసాద్, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - తణుకురూరల్

పోలీస్ వ్యవస్థను ప్రజలకు జవాబుదారీగా తెచ్చేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల అన్నారు. స్థానిక తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొని 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఆ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ నైసర్గిక స్వరూపాన్ని రేఖా చిత్రం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాల్లోని ప్రజలతో తరచూ అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నిర్వహన కోసం ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేయాలన్నారు. గతంలో ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లో నిందితులను బైండవర్లు చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ముందుగా తెలుసుకుని, సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పరిష్కరిస్తే అది ప్రజాశాంతికి భంగం కలగకుండా నిరోధించగలమని తెలిపారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు సంక్రమించిన ఓటు హక్కును ప్రజలు నిర్భయంగా, ప్రలోభాలకు గురి కాకుండా వినియోగించుకునేలా ప్రజలకు పోలీసువారు భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, తాడేపల్లిగూడెం డివిజన్ డిఎస్‌పి మూర్తి, దిశ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి నున్న మురళీకృష్ణ, తణుకు రూరల్ సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ కె.చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ఘనంగా కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రానున్న ఎన్నికల్లో తీవ్రంగా బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం పట్టణ కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం గొర్రెల సతీష్ అధ్యక్షతన సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా కార్మికవర్గంపై మోయలేని భారం పడిందన్నారు. కేంద్రప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకు, విదేశీ కార్పొరేట్లకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను మార్చివేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని దేశంలోని బడా పెట్టుబడిదారులకు అప్పగిస్తుందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు రోజురోజుకు వేతనాలు పడిపోతున్నాయన్నారు. అసంఘటితరంగ కార్మికులను ఆదుకోవడానికి సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, గొన్నబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు చర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా గొర్రెల సతీష్, సెక్రటరీ నాగ సత్యనారాయణ, కోశాధికారిగా పైలా పైడిన్న, మరో ఆరుగురు సభ్యులు నూతన కమిటీలో ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

28న జనసేన, టిడిపి మహాసభను జయప్రదం చేయండి

సభకు జెండా అని నామకరణం చేసిన నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 28వ తేదీన తాడేపల్లిగూడెం ప్రత్తిపాడు హైవేలో నిర్వహించనున్న జనసేన, తెలుగుదేశం ఉమ్మడి సభను జయప్రదం చేయాలని జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. సభకు జెండా అని నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. సభాస్థలి వద్ద సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ఎంతమంది తరలొచ్చినా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం సభ ప్రాంగణాన్ని జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ న్యాయవాదులు బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఉభయగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, ఎంఎల్ఎ నిమ్మలరామానాయుడు, వలవల బాబ్జి, కందుల దుర్గేష్, బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్‌ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆచంట నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కలెక్టర్‌కు వివరించారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చెరుకువాడ

బధిరుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం

బధిరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ తక్షణమే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలపై బధిరులకు అవగాహన కల్పించాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ శుక్రవారం ఉదయం బధిరులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

ప్రజా సమస్యలకు పరిష్కార వేదిక 'స్పందన'

నరసాపురం : ప్రజా సమస్యలకు చక్కని పరిష్కార వేదిక స్పందన అని నరసాపురం డిప్యూటీ తహశీల్దార్ నరసింహమూర్తి అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సబ్ డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత శాఖాధికారులకు పంపించి పరిష్కరించాలని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వీరవాసరం

తారతమ్యాలు లేకుండా మౌలిక వసతులు కల్పించడంలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రజాప్రతినిధుల ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా చోటు ఉంటుందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. మండలంలోని అందలూరు ఇందిరమ్మ కాలనీలో అంతర్గత సీసీ రోడ్డు పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.ఆరు లక్షలతో సుమారు 300 మీటర్లు సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇళ్లు నిర్మించుకున్న నడవటానికి కూడా అవకాశం లేకుండా ఉన్న చోట సీసీ రోడ్డు నిర్మించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాతగోలుసు భోగేశ్వరరావు, వీరవల్లి చంద్రశేఖర్, కె.రామకృష్ణ, మేకా సుబ్బారావు, మేకా కృష్ణ పాల్గొన్నారు.

శ్రీనుకు ఆర్థిక సాయం చేస్తున్న క్లబ్ సభ్యులు

అనారోగ్య బాధితుడికి వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా గుండె జబ్బుతో బాధపడుతున్న ఆకివీడు పట్టణానికి చెందిన గొర్లె శ్రీను తెలుసుకున్నారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు క్లబ్ తరపున ఆతనికి రూ.ఆరు వేల విలువైన మందులను సోమవారం పాలకొల్లు జిఎన్‌విఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, సంబారి గంగాపవన్, జవ్వాజి కళ్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు.

28న మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ సాధారణ సమావేశం ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్పర్సన్ వెంకటరమణ తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

'మద్యపాన నిషేధంపై మాట తప్పిన జగన్'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానని హామీ ఇచ్చిన జగన్ మాటతప్పి మడం తిప్పారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెనుమంచిలిలో సోమవారం నిర్వహించిన ప్రజల వద్దకు పితాని పాదయాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజావ్యతిరేకపాలనను అరాచక ముఖ్యమంత్రి జగన్‌ను గద్దె దింపాలన్నారు. నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు కేతా మీరయ్య, ప్రధాన కార్యదర్శి ఏడిద శ్రీనివాస్, జనసేన మండలాధ్యక్షుడు జవ్వాది బాలాజీ, కార్యదర్శి కావలపు రామకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిటిసి సభ్యులు ఆకుమర్తి వెంకటలక్ష్మి మోహనరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నిమ్మన శేఖర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుప్పాకుమార్, సహాయకులు కోళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బీర నరసింహమూర్తి, తెలుగు యువత మండలాధ్యక్షుడు కేతా మురళి పాల్గొన్నారు.

పెదపుల్లేరులో అఖండ అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పెదపుల్లేరులో ఉన్న సత్తెమ్మ తల్లి 59వ వార్షికోత్సవం జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకటశివరామరాజు, డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు పాల్గొన్నారు. వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అన్నసమారాధన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు పది వేల మంది తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కలిదిండి రామకృష్ణంరాజు, కలిదిండి భాస్కరరాజు, కలిదిండి సీతారామరాజు, నడింపల్లి సత్యనారాయణరాజు, కలిదిండి బలరామరాజు, గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, పాటూరి శ్రీనివాస దొరబాబు, నరసింహారావు (బాబు), పాటూరి మోహన్, పెద్దింటి నాగేశ్వరరావు, గేదెల నరసింహం, కోళ్ల రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అసంపూర్తిగా బాలికల హైస్కూల్ భవన నిర్మాణం

నిధులు సరిపోక రెండేళ్ల క్రితం ఆగిపోయిన పనులు
పట్టించుకోని అధికారులు

అసంపూర్తిగా ఉన్న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ భవనం

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణం సుమారు రెండేళ్ల క్రితం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఈ పాఠశాలకు నాలుగు తరగతి గదులు ఉన్నాయి. ఆ గదులు సరిపోకపోవడంతో ఒక్కో గదిలో రెండేసి తరగతులు నిర్వహించేవారు. ఈ పరిస్థితుల్లో స్థానికులు, ప్రముఖులు చేసిన ప్రయత్నం ఫలితంగా 2020లో మరో ఆరు గదుల నిర్మాణానికి రూ.1.13 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ఆ మేరకు మూడు గదులు నిర్మించి, పై అంతస్తులో మరో మూడు గదుల నిర్మాణం చేపట్టారు. ఆ నిర్మాణం సగం పూర్తయింది. కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. నిధులు అయిపోయాయని తెలిసింది. అయితే ఆరు గదుల నిర్మాణం ఆగిపోయి సుమారు రెండు రెండేళ్లు కావస్తోంది. వాటిని పట్టించుకున్నవారే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సగం నిర్మాణం పూర్తయిన గదిలోనే విద్యార్థుల తరగతుల నడుస్తున్నాయి. కాగా మరికొన్ని గదులు చెత్తాచెదారాలతో నిండిపోయి స్టోర్ రూములుగా మారిపోయాయి. వర్షం వస్తే పాఠశాల ప్రాంగణంలో బురదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే పాఠశాల స్థలంలో కనీసం అడుగు లోతు నీరు నిలిచిపోతుంది. ఆ వర్షపు నీటిలోనే విద్యార్థులు తిరగాల్సి వస్తుంది. వర్షపు నీరు తగ్గినా బురదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరూ పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సగంలో ఆగిపోయిన గదుల నిర్మాణం పూర్తిచేస్తే విద్యార్థులకు కనీస సదుపాయాలు ఏర్పడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అవార్డు అందుకుంటున్న రమేష్ సరళాదేవి దంపతులు

రమేష్, సరళాదేవి దంపతులకు బెస్ట్ సర్వీస్ కపుల్స్ అవార్డు

ప్రజాశక్తి - తణుకు

పట్టణానికి చెందిన వావిలాల వెంకట రమేష్, సరళాదేవి దంపతులకు 2024 బెస్ట్ సర్వీస్ కపుల్స్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో భాగంగా కుంగ్ ఫూ విద్యను గత 12 ఏళ్లుగా విద్యార్థులకు నేర్పిస్తున్నానన్నారు. మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ బుద్ధ బౌద్ధ ధర్మ ఫౌండేషన్ వారు అవార్డు అందించినట్లు చెప్పారు. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్, ఎం.చిరంజీవి, సిహెచ్.చక్రపాణి, డాక్టర్ రాజా శిఖామణి, ఎ.దామోదరం చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జివిజి.అశోక్‌కుమార్, ఫౌండేషన్ మాస్టర్ డాక్టర్ ఎంఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

బిసి సెల్ మండలాధ్యక్షునిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

బిసి సెల్ మండలాధ్యక్షుడిగా ఆగర్తిపాలెం గ్రామానికి చెందిన నున్నబోయిన వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపీ) అభినందించారు. ఆయనతోపాటు సర్పంచి ఛాంబర్స్ అధ్యక్షులు గుమ్మాపు పెద్దిరాజు, మైకేల్‌రాజు, శీలం సూరిబాబు, వైస్ ఎంపిపి పడవల సునీల్ ఉన్నారు.

'బిసిలకు జగన్ ప్రాధాన్యత'

ప్రజాశక్తి - పాలకొల్లు

బిసిలకు సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు బిసి నేతలు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బిసి సెల్ మండలాధ్యక్షునిగా నియమితులైన నున్నబోయిన వెంకటేశ్వరావు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు బిసి నేతలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ సీటు శెట్టిబలిజ సామాజిక తరగతికి తొలిసారి ఇచ్చారని, ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు ఇచ్చారని, ఇలా అనేక పదవులు బిసిలకు ఇచ్చారని చెప్పారు.

రామేశ్వర ఆలయ ఛైర్మన్‌గా విద్యాసాగర్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట శ్రీ రామేశ్వర ఆలయ ఛైర్మన్‌గా బుద్ధిరాజు విద్యాసాగర్, సభ్యులుగా అడ్డాల సూర్యప్రసాద్, కాండ్రేకుల కనకకేశవరావు, పూసపాటి కృష్ణ, మనువర్తి సుధాకరరావు, సత్యవరపు అన్నపూర్ణ, అలజంగి లక్ష్మీదేవి, బురుజుకోట అనంతలక్ష్మి, వెన్నపు ప్రసన్నలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆలయం వద్ద సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోట సరోజినీవెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, గ్రామ కమిటీ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

వేడంగిలో సమస్యల పరిష్కారానికి కృషి : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని వేడంగిలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. వేడంగి, వేడంగిపాలెంలకు చెందిన జనసేన కార్యకర్తలు ఎంఎల్‌ఎ నిమ్మలను పాలకొల్లులోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిశారు. నియోజకవర్గంలో 50 నుంచి 70 వేల మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తామని జనసేన, టిడిపి కార్యకర్తలు హామీ ఇచ్చారు. దీంతో ఎంఎల్‌ఎ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ, శ్మశానవాటిక, అర్హులకు ఇళ్లు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు.

'జనసేనకు పెరుగుతున్న ఆదరణ'

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ప్రజల్లో జనసేన పార్టీకి ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గుంటపల్లవపాలెం, పెదపల్లవపాలెం గ్రామాల్లోని పలువురు జనసేనలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదారంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కొల్లాటి గోపీకృష్ణ, జక్కం బాబ్జి, నిప్పులేటి తారకరామారావు, బందెల రవీంద్ర, అందే దొరబాబు, లక్కు బాబీ, బొక్కా చంటి, కొప్పాడి నాగరాజు, ముక్కు గిరి, గజ్జరపు మురళి, అందే కొండ, కొప్పాడి శ్రీను, నరసింహస్వామి పాల్గొన్నారు.

శివ నిర్ణయంపై ఎడతెగని ఉత్కంఠ

కార్యకర్తలు, అభిమానుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి ఉండి అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్ ఎంఎల్‌ఎ రామరాజుకు కేటాయించడంతో అదే టిక్కెట్ కోసం ప్రయత్నించిన మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు ఆగ్రహానికి గురయ్యారు. టిక్కెట్ రాకపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని ఆయన మొదటి నుంచి చెబుతూనే ఉన్నారు. రామరాజుకు టిక్కెట్ ప్రకటించిన రోజు నుంచి శివను ఆయన కార్యాలయంలో ప్రతిరోజు వందల సంఖ్య దాటి వేలాది మంది కలిసి ఆయనకు సానుభూతి ప్రకటిస్తున్నారు. ఈ స్థితిలో టిడిపి శివను ఓదార్చే ప్రయత్నం చేస్తుందా అనే మాటలు వినబడుతున్నాయి. ఈ క్రమంలోనే అధికార పార్టీ వ్యక్తులు కూడా ఆయనను కలవడం గమనార్హం. శివకు అధికార పార్టీ నుంచి ఏదో ఒక స్థానం నుంచి పోటీ అవకాశం కల్పిస్తారా అన్న ప్రశ్న కూడా ఉదయిస్తోంది. ఇప్పటికే వైసిపి ఉండి అసెంబ్లీ అభ్యర్థిగా పివిఎల్.నరసింహరాజును ఆ పార్టీ ఏనాడో నిర్ణయించిందని చెబుతున్నారు. ఇక నరసాపురం పార్లమెంటరీ స్థానానికి కూడా ఇటీవలే గూడూరి ఉమాబాల పేరు ప్రకటించారు. ఇది కాకుండా వేరే స్థానాలకు శివకు అవకాశం కనిపించదు. అయితే శివ అభిమానులు మాత్రం ఏదో ఒక స్థానం ఇస్తారని అంటున్నారు. శివ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే టిడిపి కంచుకోటకు బీటలు వారినట్లేనని పలువురు అంటున్నారు. ఈ నియోజకవర్గంలో ఒక్క పాతపాటి సర్రాజు మినహా ఎవ్వరూ తెలుగుదేశానికి ఎదురు నిలవలేక పోయారు. ఆయన ఒక్కరు మాత్రమే తెలుగుదేశంపై గెలిచారు. అయితే శివ రంగంలోకి దిగి టిడిపికి వ్యతిరేకంగా పోటీ చేస్తే ఆయనకు అనుకూలంగా టిడిపి ఓట్లు చీలుతాయన్నది పరిశీలకుల అంచనా. అదే జరిగితే మరోసారి టిడిపి కోటకు బీటలు వారినట్లే. అయితే ప్రస్తుతం టిడిపి, వైసిపి శ్రేణుల్లో ఎడతెగని ఉత్కంఠ నడుస్తోంది.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని దేవ గ్రామం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు వెంకట్రావు డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలను సిపిఎం నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పంటకాలువ పక్కన కాలనీలో కరెంటు స్తంభాలు తప్ప తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేదన్నారు. 20 మంది లబ్ధిదారులకు ఐదుగురు మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. పంచాయతీ పోరంబోకులో 16 మందికి ఏర్పాటుచేసిన మరో కాలనీలో ఒక్కరు మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టారని, అక్కడ కూడా కనీస సదుపాయాలు, రోడ్ల నిర్మాణం చేపట్టలేదని చెప్పారు. గ్రామం మధ్యలో మరో కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో విఆర్‌ఒ అప్పారావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, డి.సునీల్‌కుమార్, బొంతు నాగరాజు, చిలుకూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

3న పల్స్ పోలియోను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గణపవరం

వచ్చే నెల మూడో తేదీన ప్రభుత్వం తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండల వైద్యశాఖాధికారులు జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకర్‌రావు, తహశీల్దార్ రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలియోచుక్కలు వేయడానికి మండలంలో అన్ని ప్రధాన సెంటర్లలో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. గణపవరం ప్రాథమిక ఆసుపత్రి డాక్టర్ పి.సంతోష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో 44,044 మంది ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడమే లక్ష్యమన్నారు. మూడో తేదీ ఆదివారం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల వద్ద పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. సోమవారం నుంచి గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, అంగన్వాడీ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీనివాస్, ఎం.నల్లయ్య, ఎం.యోహాన్, ఎ.కృష్ణ, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు : ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పల్స్‌పోలియో వ్యాక్సినేటర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల మూడో తేదీన పోలియోచుక్కల కేంద్రాల వద్ద, 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పిహెచ్‌సిల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజానాగభూషణం, డాక్టర్ కె. పృథ్వీరాజ్, డాక్టర్ డేనియల్ రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ త్రిమూర్తులు, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, మహిళా ఆరోగ్య పర్యవేక్షకులు రత్నబాయి, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనాలి

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంజినీరింగ్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేయడం ద్వారా వారికి దగ్గర అవ్వడంతో పాటు మంచి పేరు సంపాదించగలరని కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కడియద్దలో శ్రీ వాసవి జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం ఆశ్రం వైద్య కళాశాల సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ ప్రారంభించగా ఆశ్రం వైద్య కళాశాల డాక్టర్లు ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కడియద్ద గ్రామస్తులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం శుభ పరిణామమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఉచిత వైద్యం అందించడానికి ముందుకొచ్చిన ఆశ్రం కళాశాల వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియద్ద గ్రామ సర్పంచి యాతం కోటేశ్వరి, గ్రామ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు దుర్గాదేవి, ఆశ్రం కళాశాల వైద్యులు తరుణ్‌సాయి, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ చందన, సాయిలక్ష్మీ, కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.రాజశేఖర్, లోకేష్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని మార్చొద్దని ఆందోళన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు పంచాయతీ కార్యాలయాన్ని కనీస సమాచారం లేకుండా మార్చివేశారని టిడిపి నేత సత్యనారాయణ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ భవనాన్ని ఎక్కడో దూరంగా మార్చటం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పంచాయతీ భవనాన్ని ఇక్కడే కొనసాగించాలని పంచాయతీ సెక్రటరీ మల్లేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు కలిదిండి రామచంద్రరాజు, జనగం మోహన్‌రావు, అందే వీరభద్రరావు, చేబ్రోలు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సత్యనారాయణ, గ్రామస్తులు

ఎన్నికల్లో వచ్చే సీజనల్ నేతలను నమ్మొద్దు

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఎన్నికల సమయంలో వచ్చే సీజనల్ నాయకులను నమ్మవద్దని, ఎల్లప్పుడు ప్రజల్లో ఒకరిగా అందుబాటులో ఉండే తనను ఆశీర్వదించాలని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా మండలంలోని ఆగర్రు గ్రామ ఎస్‌సి కాలనీలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిలోగా ఎస్‌సి కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే రూ.25 లక్షలతో భవన గ్రౌండ్ ఫ్లోర్, మరో రూ.25 లక్షలతో మొదటి అంతస్తు పూర్తయ్యేలా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. తాగునీటి, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తీరేలా రూ.69 కోట్లు మంజూరు కాగా ఆ పనులను అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు.

'హామీల అమలు ఘనత జగన్‌దే : గుడాల గోపీ

ప్రజాశక్తి - పోడూరు

ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తూ ఏవైతే హామీలు ఇచ్చారో అవన్నీ అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు అన్నారు. వైసిపి మండలాధ్యక్షుడు పితాని సత్యనారాయణ అధ్యక్షతన పెనుమదంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సిఎంగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాశ్, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, సొసైటీ ఛైర్మన్ కొర్రపాటి వీరాస్వామి, డిటిడిసి బాబు పాల్గొన్నారు.

28న టిడిపి, జనసేన మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లు ఈ నెల 28వ తేదీన తాడేపల్లిగూడెంలో నిర్వహించే ఎన్నికల శంఖారావ మహాసభను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి పిలుపునిచ్చారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ ముఖ్య నాయకుల సమావేశం పట్టణ కమిటీఅధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. టిడిపి, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల శంఖారావం పూరించడం కోసమే ఈ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, టిడిపి, అంగన్వాడీ డ్వాక్రా ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఈ నెల 28వ తేదనీ తాడేపల్లిగూడెంలో నిర్వహించే టిడిపి, జనసేన ఉమ్మడి సభలో పాల్గొనడానికి జిల్లాలోని రైతులు, మహిళలు, యువత, బడుగు, బలహీనులు ఎదురుచూస్తున్నారని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన పాలకొల్లు టిడిపి కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనపై అన్ని తరగతుల ప్రజలు నిరాశతో ఉన్నారన్నారు. వీరందరు తాడేపల్లిగూడెం భారీ సభలో పాల్గొనడానికి ఎదురు చూస్తున్నారన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ద్వారకాతిరుమల మండలం, దొరసానిపాడు గ్రామం, లక్కాబత్తుల మరియమ్మ, నా భర్త లక్కాబత్తుల నతానియేలు (లేటు) యొక్క 47 సెంట్లు భూమి **డాక్యుమెంటు నెం. 2111/2004, Dated: 03-6-2004** ఒరిజినల్ డాక్యుమెంట్స్ ది. 15-02-2024వ తేదీన భీమడోలు నుండి దొరసానిపాడు గ్రామం వస్తుండగా మార్గం మధ్యలో పడిపోవడం జరిగింది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియచేయగలరు.

లక్కాబత్తుల మరియమ్మ
దొరసానిపాడు గ్రామం
ద్వారకాతిరుమల మండలం, ఏలూరు జిల్లా
సెల్: 7569369629, 8500965377

పాస్‌పోర్టు పోయినది

GUTTULA SRINIVASA RAO అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 16-04-2019న **T0924011** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది. 19-2-2024న పితానివారిపాలెం నుండి పెనుగొండ మెయిన్‌రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GUTTULA SRINIVASA RAO
S/o. Guttula Mohana Rao
D.No. 6-173, Peethanivaripalem
Penugonda Mandal
West Godavari Dist., A.P.,

మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జిల్లా కోర్టులో, ఏలూరు
ఇ.పి. నెం. 1530/2018 ఇన్
ఎ.ఆర్.సి. నెం. 369/2017

బిట్వీన్:
మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, ఏలూరు —*డి. హెచ్. ఆర్*
మరియు
జి.వెంకట సత్యన్నారాయణ మరియు యితరులు —*జె. డి. ఆర్స్*

యిందు పై నెంబరు ఇ.పి. గ్రంధములో ఈ క్రింది షెడ్యూలు జెడిఆర్-2 అయిన జి.కనకదుర్గ శుభవాణి గారికి చెందిన ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యీ వేలము నందు యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలము **ది. 13-03-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. పబ్లికేషన్ ద్వారా తెలియపర్చడమైనది.

Hearing Date: 13-03-2024

షెడ్యూలు

West Godavari District, Chintalapudi Sub-District, Chintalapudi Mandal, Chintalapudi Village accounts area, Ziroyit dry land covered by R.S. No. 1068/2 out of an extent of Ac. 2.46 cents an extent of 400.0.0 sq.yds or 336.0 sq.mtrs is measured and bounded by:

EAST: Site of Soundarya Rajan Vijaya Lakshmi - 60ft. **SOUTH:** Site of Devarapali Koteswara Rao - 60ft. **WEST:** Panchayat Road - 60ft. **NORTH:** Site of Soundarya Rajan Vijaya Lakshmi - 60ft.

(within all easementary rights over the schedule property for ingress and eggress and water let outs etc.)

DHR Value: Rs. 35,00,000/-
Amin Value: Rs. 40,00,000/-

(2వ అదనపు జిల్లా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.N.R.GOPAL
Advocate, Eluru